క్లుప్తంగా

ఆగమోక్తంగా సంకటహర చతుర్థి పూజలు



హోమపూజలు చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని అంజి అంజి వినాయకస్వామి ఆలయం వద్ద ఆగమోక్తంగా సంకటహర చతుర్థి పూజలు ని ర్వహించారు. ఈ పూజలను అందరూ చేసు కునేలా ఆర్జిత సేవగా అందుబాటులోకి తెచ్చారు. మంగళ వారం అంజి అంజి వినాయకస్వామి ఆలయం వద్ద అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. గణపతి హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ బాపిరెడ్డి దంపతులు, ఆ లయ అధికారులు, వేదపండితులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



జేసీబీతో ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని వెస్టువరత్తూరు గ్రామంలోని దారి ఆక్రమణలను వీఆర్ఓ మురళి, సిబ్బందితో కలసి మంగళవారం జేసీబీ యంత్రంతో తొలగించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో సచివాలయం పక్కనే ఉన్న దారి ఆక్రమణకు గురికావడంతో గ్రామస్తులు తహసీల్దార్ సుబ్రమణ్యంకు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఆయన ఆదేశించడంతో దారిలోని చెట్టు, పుట్టలను జేసీబీ యంత్రంతో తొలగించి, శుభ్రం చేయడం జరిగిందన్నారు.

భవిత పాఠశాల పరిశీలన



మాట్లాడుతున్న కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని భవిత పాఠశాలను మంగళవారం తిరుపతి జి ల్లా విద్యాశాఖ ఐఈ కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌రె డ్డి పరిశీలించారు. పాఠశాలలోని రికార్డులు, రి జిస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ ప్రత్యేక ప్రతిభావంతుల కు అర్థమయ్యే రీతిలో విద్యాబుద్ధులను నేర్పించాలని తెలిపారు. వారిలో సృజనాత్మకతను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అయ్యప్ప, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణ

సత్యవేడు: ఇరుగుళం పంచాయతీలో మల్లవారి పాళెం టౌన్‌షిప్‌కు చెందిన ఒక వ్యక్తి ప్రభుత్వ స్థలం ఆక్రమిచండంతో పంచాయతీ అధికారులు నోటీసులు అందజేశారు. పంచాయతీ తాగునీటి సరఫరా పైపులైన్ ఉన్న స్థలాన్ని ఆక్రమించడంతో సదరు వ్యక్తికి నోటీసులు ఇవ్వాలని సర్పంచ్ శేఖర్ స్థానిక పంచాయతీ సెక్రటరీకి సూచించారు. అలాగే రెవెన్యూ అధికారులు ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కోరారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



ముక్కంటి ఆలయం వెలుపల ప్రముఖులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. టిడ్కో చైర్మన్ వేముల పాటి అజయ్‌కుమార్, టీటీడీ బోర్డుసభ్యులు మహేందర్‌రెడ్డి, అనుగోలు రంగశ్రీ దర్శించుకున్న వారిలో ఉన్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

నివాళి



దేశమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ గురుమూర్తి, నూకతోటి రాజేష్

నాగలాపురం: పిచ్చాటూరు మండలం వైస్ ఎంపీపీ నాగభూషణం అత్త దేశమ్మ మంగళవారం గుండెపోటుతో మరణించారు. ఈ విషయం తెలిసి తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి, సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ స్థానిక నాయకులతో కలిసి పిచ్చాటూరు మండలం నీరువాయి గ్రామానికి చేరుకుని దేశమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వైస్ ఎంపీపీ నాగభూషణం కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

శ్రీకాళహస్తి రూరల్ : ఏర్పేడు–శ్రీకాళహస్తి మార్గంలో గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు రేణిగుంట జీఆర్పీ ఎస్ఐ రవి తెలిపారు. సుమారు 35 ఏళ్ల కలిగిన వ్యక్తి సోమవారం రాత్రి రైలు కింద పడి మృతి చెందినట్లుగా భావిస్తున్నట్లు చెప్పారు. మంగళవారం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎర్రమట్టి .. కొల్లగొట్టి..



మట్టి తరలించడంతో ఏర్పడిన గొయ్యి, మట్టిని తోడేందుకు అందుబాటులో ఉంచిన జేసీబీ

సత్యవేడు నియోజకవర్గంలోని అధికార పార్టీ నేతల అండదండలతో మట్టిమాఫియా రెచ్చిపోతోంది. రోజూ వందల మేర టిప్పర్లలో ఎర్రమట్టిని పబ్లిక్‌గానే రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్నారు. కానీ అధికారులకు, పోలీసులకు, మైనింగ్ అధికారులకు ఇవేవీ పట్టవు. నియోజకవర్గంలో వారు ఉన్నా లేనట్లే అని పలువురు ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఎందుకంటే వందలాది టిప్పర్లలో మట్టి తరలిస్తున్నది కళ్లెదుటే కనిపిస్తున్నా కనీసం నియంత్రించకపోవడం వెనుక మర్మమేమిటో దేవుడికెరుక.

- అనుమతులు లేకుండానే భారీగా ఎర్ర మట్టి తరలింపు
- అధికార పార్టీల నేతల అండదండలతో రెచ్చిపోతున్న మట్టిమాఫియా
- డీకేటీ భూములను స్మగ్లర్లు కొనుగోలు చేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నట్లు ?
- చెన్నైలో అభివృద్ధి పనులకు మన మట్టే కావాలంట..!
- సత్యవేడు నుంచి యథేచ్ఛగా తరలిస్తున్నా ఎవరికీ పట్టదా ?
- ఒక్కో టిప్పర్ మట్టి రూ.20 వేల నుంచి రూ.25 వేలకు విక్రయం
- రూ.కోట్లు గడిస్తున్న అక్రమార్కులు
- ప్రజాప్రతినిధుల దగ్గర నుంచి చోటా నాయకులు, అధికారుల వరకు మామూళ్లు

సత్యవేడు : మట్టి మాఫియా పడగలు విప్పింది. అధికార పార్టీ నాయకులకు తోడు అధికారుల అండదండలు కూడా పుష్కలంగా ఉండడంతో ఆరు టిప్పర్లు.. మూడు వందల ట్రిప్పులు అన్న చందాన ఎర్రమట్టి అక్రమ రవాణా సాగుతోంది. మండలంలోని పలు గ్రామాల నుంచి రోజూ వందలాది టిప్పర్లలో ఎర్ర మట్టి పలు ప్రాంతాల నుంచి తమిళనాడుకు ఎర్రమట్టి(గ్రావెల్) నిరాటంకంగా తరలిపోతోంది. మట్టి మాఫియా నుంచి ప్రజాప్రతినిధుల దగ్గర నుంచి చోటామోటా నాయకులు, అధికారుల వరకు అందరికీ మామూళ్లు అందుతుండడంతో మిన్నకుండిపోతున్నారు. ఇక్కడ నిఘా విభాగం కూడా అన్నీ తెలిసినా చర్యలు తీసుకోకపోవడంతో ఎర్రమట్టి అక్రమ రవాణా నిర్విరామంగా కొనసాగుతుండడంతో ఆశ్చర్యం కలిగించే విషయం.

అక్కడ అభివృద్ధి పనులకు మన మట్టి..

చెన్నైలో జాతీయ రహదారి పనులు, లోతట్టు ప్రాంతాలను ఎత్తు చేయడం, పట్టణ ఆధునీకరణ, భారీ వంతెనలు, రోడ్డు విస్తరణ వంటి పనులకు తమిళనాడు కాంట్రాక్టర్లకు మట్టి అవసరం ఎక్కువ ఉంది. సదరు కాంట్రాక్టర్లకు తమిళనాడు ప్రభుత్వం మట్టి తీసుకునేందుకు అక్కడ అనుమతులు ఇవ్వడం లేదు. దీంతో మట్టి అవసరం ఎక్కువ ఉండడంతో తమిళనాడు కాంట్రాక్టర్లు, స్మగ్లర్లు సరిహద్దు ప్రాంతాలపై కన్నేశారు. ఆంధ్రా–తమిళనాడు సరిహద్దులోని మండలాల్లో టీడీపీ పార్టీ పెద్దలతో సత్సంబంధాలు పెట్టుకుని ఎర్ర మట్టి కొల్లగొట్టి తమిళనాడుకు తరలించేస్తున్నారు. ఇంక అధికారులకు కూడా మామూళ్లు ఇస్తుండడం వల్లే వారు కూడా రైట్ రైట్ అంటున్నారని స్థానికుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.

తెలుగు కాలువపై కన్ను..

తమిళ కాంట్రాక్టర్లు, స్మగ్లర్లు మొదట తెలుగు గంగ కాలువ మట్టిపై కన్నేశారు. మైనింగ్ అధికారులతో స్థానికుల పేరిట అనుమతి తీసుకుని వారికి కమీషన్లు ఇచ్చి మట్టి తరలించారు. కొన్ని ప్రాంతాల్లో గంగ కాలువ మట్టి నాణ్యత లేకపోవడంతో చెన్నైలోని ఇంజనీర్లు తిరస్కరించారు. దీంతో స్మగ్లర్లు నాణ్యత ఉన్న మట్టి కోసం పలు గ్రామాల్లో అన్వేషించి పేదల భూములపై కన్నేశారు.

డీకేటీ భూములను కొనుగోలు చేయొచ్చా..!

మండలంలోని వీఆర్ కండ్రిగలో పలువురు పేదలకు గతంలో ప్రభుత్వం డీకేటీ పట్టాలు ఇచ్చింది. ఆర్థిక స్థోమత లేక పంటలు సాగు చేయలేదు. దీన్ని ఆసరాగా తీసుకున్న స్మగ్లర్లు అధికార పార్టీకి చెందిన మండల నాయకులతో కలసి పేదలకు డబ్బు ఆశ చూపి వారి పట్టా భూములను కొని మట్టిని తోడేస్తున్నారు. టిప్పర్‌కు రూ.20 వేలు నుంచి రూ.25 వేల వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. అయితే డీకేటీ భూములను కొనడం.. అమ్మడం నేరమని చట్టం చెబుతోంది. మరి పట్టాలు ఉన్నవారు ఎలా అమ్ముతారు ? స్మగ్లర్లు ఎలా కొంటారు ? మరి రెవెన్యూ అధికారులు ఏం చేస్తున్నారనేది స్థానికుల అనుమానం.

ఎస్సీ, ఎస్టీ బీసీల భూములే టార్గెట్..

రాజుల కండ్రిగ పంచాయతీ పరిధిలో ప్రభుత్వం పట్టాలు ఇచ్చిన భూములపై స్మగ్లర్లు కన్నేశారు. గ్రామ పరిధిలోని సర్వే నంబరు 10–1లో 13.98 ఎకరాల భూమికి సంబంధించి అధికారులు పలువురికి డీకేటీ పట్టాలు ఇచ్చారు. అందులో పేదల అవసరాలను ఆసరాగా చేసుకుని సుమారు 4 ఎకరాల వరకు డీకేటీ భూములను కొనుగోలు చేసినట్లు సమాచారం. అందులో బండరాళ్లు తొలగించి నాణ్యమైన మట్టిని వేరు చేసి తరలిస్తున్నారు.

రెండు పర్యాయాలు టిప్పర్లు సీజ్

గత నెల ఆగస్టు 14వ తేదీన ఎర్రమట్టిని తరలిస్తున్న 5 టిప్పర్లను సీతారాంపేట వద్ద అధికారులు పట్టుకున్నారు. తాజాగా నవంబరు 18న సోమవారం మరోమారు రాజుల కండ్రిగ వద్ద 6టిప్పర్లను రెవెన్యూ అధికారులు సీజ్ చేసి మైనింగ్ అధికారులకు అప్పగించారు. పట్టుబడిన టిప్పర్లను ఆర్టీసీ గ్యారేజ్‌లో ఉంచారు.

పర్మిషన్లు లేవు..

మైనింగ్ అధికారుల పర్మిషన్ లేని భూమిలో మట్టి తరలిస్తున్నట్లు తెలిసింది. తహసీల్దారు ఆదేశాలతో వీఆర్ఓ వినోద్, గ్రామ సహాయకులు రత్నం, విజయ్, పోలీసుల సహకారంతో అక్రమ మట్టి తవ్వకాలను అడ్డుకున్నాం. ఆరు టిప్పర్ లారీలను సీజ్ సేశాం. గత నెలలో మదనంజేరి వద్ద అక్రమంగా మట్టి రవాణాను అడ్డుకున్నాం.

– ఆర్.సురేష్, ఇన్‌చార్జ్ ఆర్ఐ, సత్యవేడు







రాజుల కండ్రిగ నుంచి క్వారీకి వెళ్లేమార్గం, సోమవారం రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన టిప్పర్లు, గత నెలలో సీతారాంపేట వద్ద సీజ్ చేసిన టిప్పర్లు

నీట మునిగిన పంటల పరిశీలన



వరిపంటను పరిశీలిస్తున్న వీఏఏ లావణ్య

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో గత వారంలో కురిసిన భారీ వర్షానికి జంబుగోళం గ్రామంలోని నీట మునిగిన వరిపంటను విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ లావణ్య పరిశీలించారు. ఆదివారం సాక్షి దినపత్రికలో రైతు కన్నీళ్లు అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. నీట మునిగిన వరిపంట నష్టాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని వీఏఏ తెలిపారు. గ్రామంలోని రైతులు పైపురిదేవి, రంగమ్మ, శ్రీరాములయ్య, దివాకర్, కత్తిసురేష్, ప్రభావతి, అన్నపూర్ణ, బుజ్జమ్మ, కత్తిరవి, ధర్మయ్య, జానకిరామయ్యకు చెందిన 35 ఎకరాలలోని వరిపంట నీటిలో మునిగిపోవడంతో దెబ్బతిందని వాపోయారు. ఎకరాకు రూ.20 వేలు ఖర్చు అయిందని, వర్షంతో పూర్తిగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నీటి మునిగిన వరిపంటకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరారు.

సాక్షి ఎఫెక్ట్..

భోజనశాలలో వెలిగిన లైట్లు



అమర్చిన ట్యూబ్‌లైట్లు

సత్యవేడు: స్థానిక బీఆర్ అంబేడ్కర్ బాలిక గురుకుల పాఠశాల, కళాశాలలోని భోజన శాల గదిలో ట్యూబ్‌లైట్లు పాడయ్యాయి. దీంతో విద్యార్థినులు చీకట్లోనే భోజనం తినాల్సిన పరిస్థితి ఏర్పడింది. సోమవారం సాక్షి పత్రికలో ‘చీకట్లో గురుకులం’ అనే కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన కళాశాల ప్రిన్సిపల్ అవసరమైన మేరకు ట్యూబ్‌లైట్లు వేయించి సమస్య పరిష్కరించారు.

క్యాన్సర్ నిర్ధారణ శిబిరానికి స్పందన



ఏఎంపురంలో పింక్ బస్సు వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

సత్యవేడు: మండలంలోని ఏఎంపురం పంచాయతీలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షా శిబిరానికి స్పందన లభించింది. మంగళవారం స్విమ్స్ శ్రీ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆంకాలజీ పీఆర్‌ఓ చంద్రమోహన్ ఆధ్వర్యంలో దాసుకుప్పం పీహెచ్‌సీ డాక్టర్ గుణశేఖర్, సర్పంచ్ శిరీష శిబిరాన్ని ప్రారంభించారు. స్విమ్స్ ఆంకాలజీ వైద్యులు డాక్టర్ పద్మావతి, చైతన్యభాను, పరిశీలించి పింక్ బస్సు ద్వారా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. అంతకుముందు ఏఎన్‌ఎంలు బీపీ, షుగర్ పరీక్షలు చేసి, పురుషులకు నోటి క్యాన్సర్, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేపట్టారు. ఈ శిబిరాన్ని ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ రవి పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీనివాసులు రెడ్డి, ఎంపీహెచ్ఈఓ సుబ్రమణ్యం, కార్యదర్శి యుగంధర్, ఏఎన్‌ఎంలు ఇంద్రాణి, రేణుక, ఎంఎల్‌హెచ్‌పీలు సౌమ్య, లలిత, హెల్త్‌అసిస్టెంట్ షణ్ముగం, ఆశావర్కర్లు తదితరులుపాల్గొన్నారు.

విశిష్ట రకం విత్తనకాయల పంపిణీ



విత్తనకాయలు అందజేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్‌రావు, రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం

రేణిగుంట: మండలంలోని కరకంబాడి వనస్థలిలో ఉన్న రాస్ కేవీకేలో మంగళవారం రైతులకు కొత్తరకం వేరుశనగ విత్తనకాయలు పంపిణీ చేశారు. రాస్ కేవీకే, భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి సహకారంతో నిర్వహిస్తున్న ‘నూనె గింజలలో సామూహిక మొదటి తరహా ప్రదర్శన క్షేత్రాలు’ కార్యక్రమంలో భాగంగా కేవీబీ పురం మండలం కొత్తూరు, రాగిగుంట గ్రామాలకు చెందిన 100 మంది రైతులకు విశిష్ట రకం వేరుశనగ విత్తనకాయల బస్తాలను, విత్తన శుద్ధి మందును రాస్ ప్రధాన కార్యదర్శి డా.ఎస్.వెంకటరత్నం, జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్ రావు చేతుల మీదుగా అందజేశారు. అనంతరం వెంకటరత్నం మాట్లాడుతూ ప్రస్తుతం పంపిణీ చేస్తున్న విత్తనం పురుగులు, తెగుళ్ల బారిన తక్కువగా గురై మంచి దిగుబడి ఇస్తుందన్నారు. జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు మాట్లాడుతూ వేరుశనగ సాగుకు జిల్లాలో ఉన్న అనుకూలత, రైతు సేవా కేంద్రాల ద్వారా అందిస్తున్న వివిధ సేవలు, పీఎం కిసాన్, పంటల బీమా పథకాల గురించి వివరించారు. రసాయన రహిత పద్ధతిలో పండించిన ఆహారం తీసుకోవాలని, భవిష్యత్‌లో అంతా ప్రకృతి వ్యవసాయం చేయాలని కోరారు. ఏపీ ప్రకృతి వ్యవసాయ పథకం ఉప సంచాలకులు షణ్ముగం, కేవీకే ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాసులు, శాస్త్రవేత్తలు దివ్య, సుధాకర్, రాము కుమార్, అనూష పాల్గొన్నారు.

ఆక్రమణలకు పాల్పడితే చర్యలు



దుకాణాలను పరిశీలిస్తున్న ఈఓ బాపిరెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ పరిధిలో దుకాణదారులు తమ పరిధికి మించి వచ్చి ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవని ఈఓ బాపిరెడ్డి హెచ్చరించారు. మంగళవారం పురపాలకసంఘ సిబ్బంది, పోలీసు సిబ్బందితో కలిసి జలవినాయక ఆలయం నుంచి లోబావి వరకు ఉన్న దుకాణాలను పరిశీలించారు. కొందరు అక్రమంగా రోడ్డుపైకి రేకుల నిర్మించడాన్ని గుర్తించారు. పరిధికి మించి ముందుకు వస్తే చర్యలు తప్పవని వారిని హెచ్చరించారు. అదే విధంగా తోపుడుబండ్ల వారికి కూడా సూచనలు చేశారు. వచ్చే శివరాత్రిని పురస్కరించుకుని ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా, ఆక్రమణలను తొలగించాలని సంబంధిత దుకాణదారులకు తెలిపారు. కార్యక్రమంలో 1వ పట్టణ సీఐ గోపి తదితరులు పాల్గొన్నారు.

వాహనాలకు జరిమానా



రికార్డులను పరిశీలిస్తున్న ఎంవీఐ చంద్రశేఖర్

శ్రీసిటీ (వరదయ్యపాళెం): రికార్డులు లేని వాహనాలు నడిపితే జరిమానాలు, కేసులు తప్పవని పుత్తూరు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ హెచ్చరించారు. మంగళవారం శ్రీసిటీ పరిసర ప్రాంతాల్లో ఆయన పలు వాహనాలను తనిఖీ చేశారు. ఆ మేరకు రికార్డులు లేని 11 వాహనాలను గుర్తించి రూ.94 వేలు జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. ముఖ్యంగా లైసెన్సు లేకుండా వాహనాలు నడిపే వారిపై కేసులు విధించి కోర్టుకు హాజరు పరుస్తామని హెచ్చరించారు. అలాగే కాలం చెల్లిన వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడి

వరదయ్యపాళెం: పంటల సాగుకు ముందు భూసార పరీక్షలు చేసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ ద్వారకనాథ్ తెలిపారు. మంగళవారం సంతవేలూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. స్థానిక రైతు భరోసా కేంద్రం వద్ద రైతులతో మాట్లాడి పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. ప్రధానంగా ప్రస్తుత రబీలో సాగు చేస్తున్న వరి పంటలో పాటించాల్సిన మెళకువల గురించి వివరించారు. నిషేధిత పురుగు మందులు, ఎరువులను వినియోగించవద్దని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ ప్రవీణ్, సహాయకులు పవన్ గీర్వాణి, స్థానిక రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

అపార్ నమోదు త్వరగా పూర్తి చేయండి



మాట్లాడుతున్న విద్యాశాఖ జిల్లా ప్లానింగ్ అధికారి రామచంద్రారెడ్డి

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో అపార్ జనరేషన్ నమోదును త్వరితగతిన పూర్తి చేయాలని విద్యాశాఖ జిల్లా ప్లానింగ్ అధికారి రామచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన ఐఈ జిల్లా కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డితో కలసి పల్లమాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న గణిత సబ్జెక్ట్ స్కూల్ కాంప్లెక్స్, ప్రైమరీ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపార్ కార్డుతో విద్యార్థులకు అనేక ఉపయోగాలు ఉంటాయని, అపార్ కార్డులో విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, జెండర్, క్యూఆర్ కోడ్, 12 అంకెలతో కూడిన గుర్తింపు కార్డు నంబర్ అన్నీ కలిపి డిజిటల్ రూపంలో భద్ర పరచడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థి చదువుకు సంబంధించిన అకడమిక్ విద్య వివరాలు నమోదు అవుతాయి. మార్కులు, గ్రేడ్‌లు, ఉపకార వేతనాలు, క్రీడల్లో సాధించిన అంశాలు, అందులో నిక్షిప్తమవుతాయి. విద్యాసంస్థల్లో ప్రవేశాలు, ప్రవేశ పరీక్షల వివరాల నమోదు ధ్రువీకరణ సులభంగా ఉంటుందన్నారు. విద్యార్థుల వివరాలన్నీ డిజిటల్ లాక్‌లో అనుసంధానం అయి ఉండడంతో సర్టిఫికెట్లు డౌన్‌లోడ్ చేసుకునేందుకు సులువుగా ఉంటుందని, త్వరగా అపార్ నమోదు పూర్తి చేయాలని, పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ రవీంద్రనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన సోపానాలు



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



మ్యూజికల్ చైర్ ఆడుతున్న విద్యార్థులు

శ్రీకాళహస్తి: గ్రంథాలయాలు.. విజ్ఞాన సోపానాలు అని పలురు ప్రముఖులు అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు, గ్రంథాలయ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

నారాయణవనం: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక లైబ్రరీలో విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించారు. గ్రంథాలయ అధికారి జీవన్ మాట్లాడుతూ గ్రంథాలయాల సేవలను విద్యార్థులకు తెలియపరచడానికే ఏటా వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు మంగళవారం గ్రంథాలయ ఆవరణలో వివిధ ఆటల పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి వారోత్సవాల చివరి రోజున బహుమతులను ప్రదానం చేస్తామని జీవన్ తెలిపారు.

హక్కుల పరిరక్షణపై అవగాహన



బహుమతులు అందిస్తున్న ప్రగతి సంస్థ నిర్వాహకులు

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలంలోని తొట్టంబే డు, పూడి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో సార్వత్రిక బాలల హక్కుల పరిరక్షణ వారోత్సవాలను నిర్వహించారు. ప్రగతి సంస్థ సిబ్బంది సుభాష్ చంద్రబోస్, శిరీష మాట్లాడు తూ బాల్యవివాహాల నిర్మూలన, బాల కార్మిక వ్యవ స్థ నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించా రు. అనంతరం వాటిపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి నివాళి



ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న డాక్టర్ బత్తెయ్యనాయుడు

శ్రీకాళహస్తి: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని ఆ పార్టీ నాయకులు డాక్టర్ బత్తెయ్యనాయుడు, సమన్వయకర్త తలపా దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆమె సేవలను కొనియాడారు. బ్యాంకులను జాతీయకరణ చేసిన ఘనత ఇందిరాకే దక్కుతుందని తెలిపారు. అదేవిధంగా ప్రతి పేదవాడికి ఇల్లు నిర్మించి ఇచ్చారన్నారు. ప్రపంచ దేశాలు ఆమెను ఉక్కు మహిళగా కొనియాడాయని తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మొక్కలను సద్వినియోగం చేసుకోండి



నర్సరీలో అందుబాటులో ఉన్న మామిడి మొక్కలు

శ్రీకాళహస్తి రూరల్: నర్సరీలో అందుబాటులో ఉన్న మొక్కలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానవన శాఖ అధికారి పుష్పలత కోరారు. శ్రీకాళహస్తి మండలం ఉద్యానవన క్షేత్రంలో మామిడి, కొబ్బరి మొక్కలు అందుబాటులో ఉన్నాయని మంగళవారం ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. మామిడిలో బేనీషా, మల్లిక, బెంగళూరు రకాల పండ్ల మొక్కలు అందుబాటులో ఉన్నాయన్నాయన్నారు. మొక్కలు కావలసిన రైతులు నర్సరీ అధికారి 7995086968, ఎంపీఈఓ 9100411321 నంబర్లలో సంప్రదించాలన్నారు. లేదంటే ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉద్యానవన క్షేత్రంలో అందుబాటులో తాము ఉంటామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



వరదయ్యపాళెంలో దుకాణదారులకు సూచనలు ఇస్తున్న ఎస్ఐ మల్లికార్జున

వరదయ్యపాళెం: ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించి రోడ్లపై దుకాణాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ మల్లికార్జున హెచ్చరించారు. సోమవారం సాయంత్రం ఆయన వరదయ్యపాళెంలోని బస్టాండ్ ప్రధాన రోడ్డు మార్గంలో స్థానికులు, వాహనదారులతో మాట్లాడారు. దుకాణాల వద్ద అడ్డదిడ్డంగా వాహనాలను పార్క్ చేస్తే దుకాణదారులదే బాధ్యత అని తెలిపారు. అంతేకాక బస్టాండ్ ఆవరణలో డివైడర్‌కు ఆనుకుని రోడ్డుకు అడ్డంగా పెట్టవద్దని తోపుడు బండ్ల వ్యాపారులకు సూచించారు. అంతేకాక పూల దుకాణాల మలుపు వద్ద కూడా రోడ్లపై అక్రమంగా ఏర్పాటు చేసిన దుకాణాలను స్వచ్ఛందంగా దుకాణదారులే తొలగించి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఉండేందుకు సహకరించాలని కోరారు. పరిశ్రమలకు కార్మికులను తరలించే బస్సులు సైతం బస్టాండ్‌లో గానీ, లేదా పెట్రోల్ బంకు సమీపంలో గానీ ఆపి కార్మికులను ఎక్కించుకోవడం, దింపడం చేయాలన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వెంకటముని, పీసీలు సుబ్బు, హరిలు ఉన్నారు.

నవజాత శిశు వారోత్సవాలు

తిరుపతి తుడా : రుయా ఆస్పత్రి చిన్నపిల్లల విభాగం ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ నవజాత శిశు వారోత్సవాల అవగాహన ర్యాలీని నిర్వహించారు. నవజాత శిశువుల సంరక్షణ, ఆరోగ్య భద్రత అనే అంశంపై రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు, చిన్న పిల్లల విభాగాధిపతి డాక్టర్ మనోహర్ వివరించారు. ప్రొఫెసర్ కిరీటి, డాక్టర్ అంజన్ కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా లక్ష బిల్వార్చన



కార్తీక మాసాన్ని పురస్కరించుకుని టీటీడీ ఆధ్వర్యంలో తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన సేవను మంగళవారం వైభవంగా నిర్వహించారు. రుద్రహోమం చేపట్టారు. స్వామి,అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామి,అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

– సాక్షి, తిరుపతి ఫొటో గ్రాఫర్